

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలోని జిల్లాల్లో డిగ్రీ కోర్సుల్లో 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

- 8లో▸



దేశాన్ని ముందుకు నడిపించేది వ్యవసాయమే.. - 8లో▸

దేశాన్ని ముందుకు నడిపించేది కేవలం వ్యవసాయమేనని సీజీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
$42.4^0/29.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యమకారులను గుర్తించాలి



మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలని దగాపడ్డ తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు దార్ల శివరాజ్, హమ్మద్ ఖాన్, సుధాకర్, రాము డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణకు వ్యతిరేకంగా పని చేసిన వారికి పదవులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, మూడెకరాల భూమితో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. ఉద్యమకారుల్లోని దళితులకు దళితబంధు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నీలేష్‌రాయ్, రామకృష్ణ, హన్మంత్, భాస్కర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు

14 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఎస్పీ శరత్ చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా తుది రాత పరీక్ష రాసిన వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 14నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని మహబూబాబాద్ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు సంబంధించిన 7,034 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాలని రిక్రూట్‌మెంట్ బోర్డు నుంచి ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 14నుంచి 26వ తేదీ వరకు ప్రతీరోజు 600 మంది సర్టిఫికెట్లు పరిశీలిస్తామని, దీనికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమవుతుందన్నారు. అభ్యర్థులు తమకు నిర్దేశించిన తేదీల్లో మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు కులం/కమ్యూనిటీ, ఈడబ్ల్యూఎస్, ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, జనన ధ్రువీకరణ పత్రం (చదువుకున్నప్పటి నుంచి), బోనఫైడ్, లోకల్/నాన్ లోకల్ రెసిడెన్షియల్ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్, ఎంఎస్పీ, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. ఉదయం 300మంది, మధ్యాహ్నం 300మంది సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తామన్నారు. అభ్యర్థులందరూ సకాలంలో అన్ని పత్రాలతో హాజరై జిల్లా పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు.

రేపు వైద్యారోగ్య దినోత్సవం

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీన వైద్యారోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. వైద్యారోగ్య దినోత్సవంలో భాగంగా ఉత్తమ వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లను సన్మానిస్తామని చెప్పారు. ఉత్సవాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అనుమతులు లేని ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

నెల్లికుదురు: అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మీనారాయణ డీలర్లను హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పురుగు మందులు, విత్తన డీలర్లకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విత్తన, ఎరువుల విక్రయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల ఎరువుల షాపుల డీలర్లు వేముల బాబ్జి, లక్ష్మారెడ్డి, యాకన్న పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

మహబూబాబాద్: దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి కె.రవి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు అంతంతే..



పాఠశాలల పునఃప్రారంభం

- 23శాతం మంది విద్యార్థుల హాజరు
- ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట
- కనీస సౌకర్యాలు కరువు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సోమవారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు అనంతరం విద్యార్థులు బడిబాట పట్టారు. ఇన్నిరోజులు బోసిపోయిన పాఠశాలలు కళకళలాడాయి. కాగా ఎండలు దంచికొడుతుండడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో జిల్లాలో 23.50శాతమే విద్యార్థుల హాజరు నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. కనీసం తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడ్డారు.

ప్రైవేటులో కళకళ

జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాఠశాలలకు హాజరైన విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులుపడ్డారు. ఎండల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా సమయానికి హాజరుకాలేదు.. పాఠాలు బోధించలేదు. వచ్చిన విద్యార్థులు స్కూల్ ఆవరణలో ఆటలాడుతూ కనిపించారు. ఇదిలా ఉండగా సర్కారు బడులకు భిన్నంగా ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. అధిక శాతం విద్యార్థులు హాజరయ్యారు.

సమస్యల స్వాగతం..

ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలికాయి. చాలా చోట్ల తాగునీరు, విద్యుత్ అంతరాయం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో సమస్యలు యథావిధిగా దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. కొన్ని పాఠశాలల్లో కిటికీలు సరిగాలేక, ఫ్యాన్లు తిరగకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఏకరూప దుస్తులు అన్ని పాఠశాలల్లో అందించలేదు. పలు తండాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేని పాఠశాలలు తెరుచుకోలేదు. విద్యార్థులు ఎదురుచూసి తిరిగి ఇళ్లకు వెళ్లారు.



నిరుపయోగంగా మారిన తాగునీటి నల్లాలు



పై ఫొటోలో కనిపిస్తున్నది మానుకోట పట్టణ పరిధి వేల్పుల సత్యంనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 90మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. ముగ్గురు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఈ పాఠశాల మన ఊరు–మన బడి కార్యక్రమానికి ఎంపికైంది. కాగా కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదు. సోమవారం పాఠశాల పునఃప్రారంభం కాగా తాగునీరు, మరుగుదొడ్లలో నీరు లేక విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయురాలు ఇబ్బందులు పడ్డారు. గతంలో బోరు ఉండేది. దానిని తొలగించి మిషన్ భగీరథ పైప్‌లైన్ వేస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు పైప్‌లైన్ వేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. వంట నిర్వాహకులు ఇంటి వద్దే మధ్యాహ్నం భోజనం వండుకుని తెచ్చి విద్యార్థులకు వడ్డించారు. ఇలా మొదటిరోజు విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పాఠాలు విన్నారు.



హాజరైన విద్యార్థులు

సకాలంలో ఉపాధ్యాయులు హాజరుకావాలి



ప్రభుత్వ ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలలకు హాజరు కావాలి. అదేవిధంగా గైర్హాజరైన, పాఠశాలలు సమయానికి తెరవని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా నడుచుకోవాలి.

- పి.రామారావు, డీఈఓ

విద్యార్థులు హాజరుశాతం

మండలం	విద్యార్థుల సంఖ్య	హాజరైన విద్యార్థులు	శాతం
బయ్యారం	2,421	750	30.98
చిన్నగూడూరు	912	197	21.60
దంతాలపల్లి	2,446	578	23.63
డోర్నకల్	3,309	689	20.82
గంగారం	426	331	77.70
గార్ల	1,916	740	38.62
గూడూరు	3,268	912	27.91
ఇనుగుర్తి	1,434	208	14.50
కేసముద్రం	3,498	849	24.27
కొత్తగూడ	1,330	542	40.75
కురవి	3849	1,014	27.05
మహబూబాబాద్	7,659	1,569	20.49
మరిపెడ	4,303	753	17.50
నర్సింహులపేట	2575	502	19.50
నెల్లికుదురు	3,487	1,035	29.68
పెద్దవంగర	1,542	359	23.28
సీరోలు	1,690	406	24.02
తొర్రూరు	4,758	535	11.24
మొత్తం	50,823	1,1969	23.50

జగదీశ్‌కు నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



కుసుమానికి కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పిన మంత్రి కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు..అండగా ఉంటామని హామీ



జగదీశ్ పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పి నివాళులర్పిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, తదితరులు

బీఆర్‌ఎస్ ములుగు జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు సోమవారం తన స్వగ్రామమైన మల్లంపల్లిలో జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు మంత్రులు హాజరై కన్నీటి నివాళులర్పించారు. కేటీఆర్ జగదీశ్ పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

- ములుగు

- పూర్తి వివరాలు 8లో▸

విద్యార్థుల నమోదుశాతం పెరగాలి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగాలని డీఈఓ రామారావు అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, విద్యపై అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇప్పటినుంచే కృషి జరగాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందే విధంగా హెచ్‌ఎంలు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ ఎం. శ్రీరాములు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ రామారావు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం మధ్యాహ్నం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో లేకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలు ఇంటికి వెళ్లారని ఉపాధ్యాయులు సమాధానం చెప్పగా.. వారు వెళ్తుంటే మీరు ఏం చేశారని డీఈఓ మండిపడ్డారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక


మహబూబాబాద్: ప్రజావాణిలో అందిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి అనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని, లేని యెడల కారణంతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. ప్రజావాణిలో 97దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా నిర్వహించాలి..

దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో గిరిజన ఉత్సవం, పల్లె ప్రగతి దినోత్సవం, హరితహారం వంటి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ శశాంక ఉత్సవాల నిర్వహణ, ఇతర కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు


ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ‘డబుల్’ సెగ

మరిపెడ రూరల్: డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తన పర్యటనలో ఏ గ్రామానికి వెళ్లినా డబుల్ బెడ్రూం ఇళ్ల సెగ తాకుతోంది. గ్రామాలు, తండాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అడ్డగింతలు, నిలదీయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా సోమవారం మరిపెడ మండలంలోని తాళ్లఊకల్, పాంబండతండా, వెంకంపాడు, చింతలగడ్డతండా, చాప్లతండా, బావోజిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటించారు. ప్రతీ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బాల్యతండాలో 3 ఇళ్లు, పాంబండతండాలో 20, తాళ్లఊకల్‌లో 40, చాప్లతండాలో 10, రూప్‌సింగ్‌తండాలో 10, రేక్యాతండాలో 10, చింతలగడ్డతండాలో 20, బావోజిగూడెంలో 15ఇళ్లు రెండు నెలల్లో మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామాల్లోని విద్యుత్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు సంబంధిత ఏఈతో ఎమ్మెల్యే మాట్లాడి వారం రోజుల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చింతలగడ్డతండా, రూప్‌సింగ్‌తండా, వెంకంపాడులో తాగునీరు సరఫరా కావడం లేదని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో గ్రామ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలగడ్డతండా జీపీలో రూ.3.50లక్షలతో కొత్త పైపులైన్ వేయించాలని కార్యదర్శికి సూచించారు. కొత్తగా పింఛన్ మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా.. దరఖాస్తు చేసుకొని రెడీగా ఉండాలని వారికి సూచించారు. అర్హులకు దళితబంధు పథకం అందజేస్తామని పలు గ్రామాల్లో దళితులకు హామీ ఇచ్చారు. బావోజిగూడెంలో పెద్దసముద్రం చెరువు మత్తడిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.40 కోట్ల నిధులతో శంకుస్థాపన, రూ.1.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డి, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న పాల్గొన్నారు.



చాప్లతండాలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేను నిలదీస్తున్న గిరిజన మహిళలు

అడ్డుకునేందుకు..



తాళ్లఊకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతుండగా ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే వారిని బయటకు పంపించాలని ఎస్సైని ఆదేశించారు. పోలీసులు వారిని సమావేశం నుంచి పక్కకు లాగారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే వెళ్తుండగా మళ్లీ వారిద్దరు కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు వారిని బలవంతంగా పక్కకు నెట్టారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే కాన్వాయ్ మరో గ్రామానికి వెళ్లింది.

సీఎం కేసీఆర్ పాలనలో ఆరోగ్య తెలంగాణ

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు
- జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్

మహబూబాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆరోగ్య తెలంగాణగా మారి, దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమానికి వారు హాజరై ముందుగా జుంబా డ్యాన్స్ చేసి అందరిని ఉత్సాహపరిచారు. అనంతరం జెండా ఊపి రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో పోలీసులు ప్రజలకు దగ్గరయ్యారని, ప్రభుత్వ, ప్రజా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారన్నారు. వ్యాయామం, నడకతో ఆరోగ్యంగా ఉంటారని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. నడక అన్ని విధాలా మేలు చేస్తుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. 2కే రన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, జిల్లా క్రీడలశాఖ అధికారి అనిల్, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, వార్డు కౌన్సిలర్లు, ఉద్యోగులు, వివిధ కాలోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రన్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తదితరులు

ఆత్మస్థైర్యం నింపిన కేసీఆర్..

మరిపెడ: తెలంగాణ పోలీసుల్లో సీఎం కేసీఆర్ ఆత్మస్థైర్యం నింపారని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో మరిపెడలో సోమవారం 2కే రన్ నిర్వహించారు. రెడ్యానాయక్ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. సీఎం కేసీఆర్ పాలనలో పోలీసులు తమ వంతు కర్తవ్యం నిర్వర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, మున్సిపల్ చైర్మన్ సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, తొర్రూర్ డీఎస్పీ రఘు, మరిపెడ, డోర్నకల్ సీఐలు విద్యాసాగర్, వెంకటరత్నం, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, నరేష్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రఘు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుంచి ఎస్పీ సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం పరిష్కరించడం పోలీసు అధికారుల కర్తవ్యం అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 వరకు ఫిర్యాదులు స్వీకరించడానికి అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని డీఐఈఓ సత్యనారాయణ తెలిపారు. 14 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చెప్పారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్ష జరిగిందన్నారు. జనరల్ విభాగంలో తెలుగు పరీక్షకు 937 మంది విద్యార్థులకు గానూ 884మంది హాజరై, 53మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ గ్రూప్‌లో 189మంది విద్యార్థులకు 161 మంది హాజరై, 28 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ తెలుగు పరీక్షకు 263 మంది విద్యార్థులకు గానూ 255 మంది హాజరయ్యారని, 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ గ్రూప్‌లో 92 మందికి 79 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై, 13 మంది గైర్హాజరయ్యారని, మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ తెలిపారు.

5 రోజులు వ్యవసాయ మార్కెట్‌ బంద్‌



వరంగల్‌ : వరంగల్‌ ఏనుమాముల మార్కెట్‌ ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు 5 రోజులు బంద్‌ ఉంటుందని మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ దిడ్డి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా గుమస్తా, హమాలీల విజ్ఞప్తి మేరకు ఛాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ – ఇండస్ట్రీస్‌ లేఖతో బుధ, గురు, శుక్ర వారాల్లో సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. 17వ తేదీ శనివారం యార్డు బంద్‌, 18వ తేదీ ఆదివారం వారాంతపు సెలవులతో మొత్తం ఐదురోజులు మార్కెట్‌ బంద్‌ ఉంటుందన్నారు. 19వ తేదీన మార్కెట్‌ పునఃప్రారంభం అవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు.

రెడ్డి చికెన్‌ సెంటర్‌
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

WANTED TEACHERS
PRE-PRIMARY Nursery, LKG, UKG
PRIMARY English, Science
UPPER PRIMARY English, Science, Maths
HIGH SCHOOL Hindi
• PET (Female) • Wardens • Ayas • Drivers
Fluency in English is must for Teaching Staff
Interview on: June 13th, 14th, 15th 10am-4pm
TRIVI HIGH SCHOOL
Hunter Road, Hanumakonda
Cell: 9492807333, 9676244567

Two days Only
Parinaya
JUNE-2023
Hi Fi Fashions
Exhibition & Sale
TUE 13
WED 14
HOTEL ASHOKA
HANAMKONDA, WGL.
FASHION | JEWELLERY | LUXURY | DECOR
10 am to 9 pm | Call on 9441183981



ములుగు జెడ్పీ చైర్మన్‌ కుసుమ జగదీశ్‌ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న యాదవరెడ్డి, కర్నె ప్రభాకర్‌, ఎమ్మెల్యే పెద్ది, చెరుకు సుధాకర్‌, ఎమ్మెల్సీలు కడియం, సారయ్య, జెడ్పీ చైర్మన్‌ పుట్ట మధు, ఎమ్మెల్యే సీతక్క, ఎంపీ దయాకర్‌

కుసుమానికి కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్‌ జగదీశ్‌ అంత్యక్రియలు

- చివరి చూపునకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పార్థివదేహంపై బీఆర్‌ఎస్‌ జెండాకప్పిన మంత్రి కేటీఆర్‌
- కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అండగా ఉంటామని హామీ
- పాడె మోసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- జనసంద్రంగా మారిన మల్లంపల్లి



అంతిమ యాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు



జగదీశ్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్‌



జగదీశ్‌ తల్లిని ఓదార్చుతున్న మంత్రి ఎర్రబెల్లి

ములుగు: బీఆర్‌ఎస్‌ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్‌ కుసుమ జగదీశ్‌కు సోమవారం అభిమానులు, పార్టీ కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మల్లంపల్లి జనసంద్రమైంది. జగదీశ్‌ ఆదివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆస్పత్రినుంచి ఆయన పార్థివదేహాన్ని తన స్వగ్రామమైన మల్లంపల్లికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఆయన చేసిన మేలును గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

అధికార లాంఛనాలతో..

సీఎం కేసీఆర్‌ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో కుసుమ జగదీశ్‌ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్‌ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది. సుమారు గంటపాటు జరిగిన అంతిమయాత్రలో ఎండను సైతం లెక్కచేయకుండా అభిమానగణం పాల్గొంది. కుమారుడు వెంకట సత్యదేవ్‌ కుండపట్టారు. మధ్యాహ్నం 12: 35 గంటల సమయంలో స్థానిక వారి సొంతభూమిలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

హాజరైన మంత్రి కేటీఆర్‌

రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌ సోమవారం ఉదయం జగదీశ్‌ అంత్యక్రియలకు హాజరయ్యారు. బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌తోపాటు ఎంపీ సంతోష్‌ కుమార్‌, ఎమ్మెల్యే బాల్క సుమన్‌, ఎంపీ రంజిత్‌ కుమార్‌ రెడ్డితో కలిసి వచ్చారు. జగదీశ్‌ భౌతికకాయంపై బీఆర్‌ఎస్‌ జెండా కప్పారు. పూలమాల వేసి నివాళులర్పించారు. పక్కనే ఉన్న తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్‌లు కేటీఆర్‌ను చూసి బోరున విలపించారు. దీంతో వారిని దగ్గరికి తీసుకొని ఓదార్చారు.

జనసంద్రంగా.. అంతిమయాత్ర

జగదీశ్‌ అంతిమయాత్ర జనయాత్రగా మారింది. ములుగు జిల్లాతోపాటు ఉమ్మడి వరంగల్‌, హైదరాబాద్‌, నల్లగొండ, కరీంనగర్‌ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో ములుగు, నర్సంపేట దారి కిక్కిరిసిపోయింది. మల్లంపల్లిలో చదువుకున్న 1991వ బ్యాచ్‌ మిత్రులు హాజరై జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎస్పీ గాష్‌ఆలం ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన దారిని వన్‌ వేగా మార్చారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల వాహనాలను మాత్రమే అనుమతించారు. జగదీశ్‌తో ఉన్న సన్నిహితంతో జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి సత్యవతిరాథోడ్‌, ఎంపీ కవిత సోమవారం ఉదయం నుంచి అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. అంతకుముందు మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాడె మోసి అభిమానం చాటుకున్నారు.

ఆత్మీయ సోదరుడిని కోల్పోయా : కేటీఆర్‌

రెండు దశాబ్దాలపాటు సీఎం కేసీఆర్‌తోపాటు ఉద్యమంలో నిలిచి ఉత్తముడిగా ఉన్నాడు. నాకు ఆత్మీయ సోదరుడిగా ఉన్న జగదీశ్‌ను కోల్పోవడం బాధగా ఉంది. సీఎం ఏ పని చెప్పిన వెనుకడుగు వేయకుండా చేశాడు. చిన్న వయసులోనే మృతిచెందడం బాధాకరం. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం.

ప్రముఖుల నివాళి

జగదీశ్‌ పార్థివదేహాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌ రావు, పువ్వాడ అజయ్‌, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చీఫ్‌విప్‌ వినయ్‌ భాస్కర్‌, విప్‌ ప్రభాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్‌, బానోత్‌ శంకర్‌ నాయక్‌, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్‌ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్‌ సారయ్య, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌ కుమార్‌, వరంగల్‌, మహబూబాబాద్‌ జెడ్పీ చైర్‌పర్సన్స్‌ గండ్ర జ్యోతి, ఆంగోత్‌ బిందు, జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ బడే నాగజ్యోతి, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌ వీరమల్ల ప్రకాష్‌రావు, రెడ్‌కో చైర్మన్‌ యారువ సతీ ష్‌ రెడ్డి, బీసీ కమిషన్‌ చైర్మన్‌ కృష్ణ మోహన్‌రావు, కలెక్టర్‌ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్‌, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బు చ్చయ్య, హనుమకొండ, ములుగు గ్రంథాల య సంస్థ చైర్మన్‌లు అజీజ్‌ ఖాన్‌, గోవింద్‌ నాయక్‌, జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమాదేవి, తుమ్మల హరిబాబు, ఎంపీపీ శ్రీదేవి, మాజీ ఎంపీ సీతారాంనాయక్‌, అధికారులు ఉన్నారు.

WANTED TEACHERS
SAMATHA HIGH SCHOOL E/M
Reddy Colony & Kumarpally, Hanamakonda.
A well reputed english medium school requires the following staff members
• Clerk & Receptionist, Music, Dance, PET, Computer Teachers.
• High School: Telugu, English, Maths, Physical Science, Biological Science, Social.
• Primary School : All Subjects
Preferred E/M background candidates only, interested candidates can apply resume on or before 15th June 2023
9885110528 / 6281922265 mail id: samathahighschool28@gmail.com

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్‌ పరీక్షలు

- హాజరుకానున్న 1,81,286 మంది విద్యార్థులు
- 131 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఎల్‌బీ, ఒకేషనల్‌ కోర్సుల్లో 2వ , 4వ, 6వ సెమిస్టర్‌ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్‌ సోమవారం తెలిపారు. రెండో సెమిస్టర్‌కు 71,204 మంది, 4వ సెమిస్టర్‌లో 64,900 మంది, 6వ సెమిస్టర్‌లో 45,182 మంది విద్యార్థులు మొత్తం 1,81, 86 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 48 , ఆదిలాబాద్‌ జిల్లాలో 50, ఖమ్మం జిల్లాలో 33 మొత్తం 131 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2వ సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. 4వ సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 14,16, 19, 21, 23, 25, 28, జూలై 3, 5, 7వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 6వ సెమిస్టర్‌ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6,10, 11, 12, 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

దేశాన్ని ముందుకు నడిపించేది వ్యవసాయమే..

- సీబీఐ మాజీ జాయింట్‌ డైరెక్టర్‌ లక్ష్మీనారాయణ
- తాళ్లపూసపల్లిలో రైతు శిక్షణ శిబిరం



రైతులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న సీబీఐ మాజీ జేడీ

కేసముద్రం: దేశాన్ని ముందుకు నడిపించేది కేవలం వ్యవసాయమేనని సీబీఐ మాజీ జాయింట్‌ డైరెక్టర్‌ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపూసపల్లిలో రైతు జైపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఎన్‌డ్రాపోడ్‌, ఆదిగురు భారత సంఘం, అరబిందో ఫార్మా ఫౌండేషన్‌, జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సేంద్రియ పంటలు–గో ఆధారిత వ్యవసాయంపై రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశంలోని ప్రజలు, వలసలు వచ్చిన వారికి ఆహారాన్ని అందించింది వ్యవసాయమేనన్నారు. గతంలో అమెరికా నుంచి పడవ వస్తేనే మనకు ఆహారమని, కాని ఇప్పుడు మనదేశం ప్రపంచంలోని 70 దేశాలకు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ చెప్పారని, అంటే మన దేశం ఏ స్థాయిలో ఉందనేది అర్థమవుతుందన్నారు. స్వామినాథన్‌ కమిషన్‌ ప్రకారంగా గిట్టుబా టు ధరను, పంట బీమాను ప్రభుత్వాలు అందించాలన్నా రు. రాజమండ్రిలోని ధర్మవరంలో తాను 12 ఎకరాల భూ మిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నానని, రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. ప్రకృతిసాగును క్రమక్రమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కగానుగ నూనె యంత్రాన్ని ప్రారంభించారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న రైతులను సన్మానించారు. కేవీకే కోఆర్డినేటర్‌ మాలతి, జేవీఆర్‌హెచ్‌ఆర్‌ భాస్కర్‌, వెంకట్రాంరెడ్డి, రమేష్‌, రైతులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ దుర్మరణం..

- వరంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సుమతి (ఫైల్‌)

ఖిలా వరంగల్‌: మరో రెండు అడుగులు వేస్తే ఇంట్లోకి క్షేమంగా చేరుకునే వారు.. ఆ లోపే ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. ఆటో దిగి రోడ్డు క్రాస్‌ చేస్తుండగా వేగంగా వస్తున్న క్రేన్‌ వెహికల్‌ వారిని ఢీకొంది. దీంతో భార్య అక్కడిక్కడే దుర్మరణం చెందగా భర్త తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు . ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్‌ ఫోర్ట్‌ రోడ్డు విద్యానగర్‌ కాలనీకి చెందిన కాలువ సుమతి (82) , బాలరాజు (82) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి సోమవారం ఉదయం 5గంటలకు వరంగల్‌కు చేరుకున్నారు. వరంగల్‌ హెడ్‌పోస్టాఫీస్‌ జంక్షన్‌లో ఆటో ఎక్కి ఇంటికి బయల్దేరారు. వరంగల్‌ ఫోర్ట్‌ రోడ్డులోని సాయిబాబా గుడి కమాన్‌ సమీపంలో ఆటో దిగి రోడ్డు క్రాస్‌ చేస్తుండగా వరంగల్‌ నుంచి వేగంగా వస్తున్న క్రేన్‌ వెహికల్‌ వారిని ఢీకొంది. దీంతో సుమతి అక్కడికక్కడే దుర్మరణం చెందగా బాలరాజు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాలరాజును 108లో నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని బంధువులు తెలిపారు. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో విద్యానగర్‌ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నూకశాతం అధికంగా ఉండే ధాన్యం తీసుకోం

- రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సంపత్‌కుమార్‌

న్యూశాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రారైస్‌ ఎఫ్‌సీఐ ద్వారా మాత్రమే సేకరిస్తున్న నేపథ్యంలో అధిక నూక శాతం కలిగిన 1001 ధాన్యాన్ని భవిష్యత్‌లో దిగుమతి చేసుకోబోమని వరంగల్‌ జిల్లా రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తోట సంపత్‌ కుమార్‌ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రకం ధాన్యాన్ని తాము సేకరిస్తే ఎఫ్‌సీఐ తిరస్కరిస్తోందన్నారు. గత సంవత్సరం ఖరీఫ్‌ సీజన్‌లో సేకరించిన లక్షకు పైగా టన్నుల ధాన్యం నిల్వలు మిల్లుల లోనే పోరుకుపోయాయన్నారు. దీంతో మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. తమ బాధను అర్థం చేసుకుని రైతులు 2023–24 ఖరీఫ్‌ సీజన్‌లో 1001 రకం వరి సాగు చేపట్టొదన్నారు. వానాకాలంలో ఎంటీయూ, ఎంటీయూ1061, ఆర్‌ఎన్‌ఆర్‌, హెచ్‌ఎంటీ, సోనా, బీపీటీ, 5204, స్వర్ణ తదితర రకాలను పండించాలని సూచించారు. అలాగే, వ్యాపారులు కూడా 1001 రకం విత్తనాలు విక్రయించకుండా తమకు సహకరించాలన్నారు.

అశ్రునయనాల మధ్య భవ్య అంత్యక్రియలు

- జిల్లేడు చెట్టుకు పెళ్లి.. అనంతరం దహన సంస్కారాలు
- గ్రామంలో మిన్నంటిన రోదనలు
- ముగ్గురిపై కేసు నమోదు



భవ్య అంతిమయాత్రలో గ్రామస్తులు

కురవి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడం.. పెద్దలు పంచాయితీ చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్‌ విద్యార్థిని సాతర్ల భవ్య అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో భవ్యకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. పోస్టుమార్టం అనంతరం భవ్య మృతదేహాన్ని పోలీసుల భారీ బందోబస్తు మధ్య గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం భవ్యకు, జిల్లేడు చెట్టుకు పెళ్లి చేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. అనంతరం భవ్య మృతదేహాన్ని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కాగా, మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు ప్రియుడు రుద్రారపు వినయ్‌, అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్‌, సుభద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు.

నిట్‌లో అడిటివ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్‌



మాట్లాడుతున్న నిట్‌ డైరెక్టర్‌ బిద్యాధర్‌ సుబుదీ

కాజీపేట అర్బన్‌ : దేశంలోనే తొలిసారి నిట్‌ వరంగల్‌లో అడిటివ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌ విభాగంలో ఎంటెక్‌ కోర్సును ప్రారంభించినట్లు నిట్‌ డైరెక్టర్‌ బిద్యాధర్‌ సుబుదీ తెలిపారు. నిట్‌ సెమినార్‌ హాల్‌లో సోమవారం డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ(డీఎస్టీ) యాక్సలరేటెడ్‌ విజ్ఞాన్‌ ప్రాజెక్ట్‌లో భాగంగా 'మెటీరియల్‌ సైన్స్‌ అండ్‌ అడిటివ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌' అనే అంశంపై ఏర్పాటు చేసిన హై ఎండ్‌ రీసెర్చ్‌ ట్రైనింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిట్‌ వరంగల్‌లో మెటల్‌ త్రీడీ ప్రింటింగ్‌ అందుబాటులో ఉందని, నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ అడిటివ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌తో నిట్‌ ఎంఓయూ కుదుర్చుకుందని తెలిపారు. నిట్‌ వరంగల్‌ బెంగుళూరులోని సీఎంటీఐ సౌజన్యంతో అడిటివ్‌ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్‌ కోర్సును ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఐఆర్‌ ,సీజీసీఆర్‌ఐ చీఫ్‌ సైంటిస్ట్‌ వంశీకృష్ణ, బెంగుళూరు జీఈ ఏవియేషన్స్‌ ప్రొఫెసర్‌ ఉమామహేశ్వర్‌, మంజయ్య, రవికుమార్‌, ఆడెపు కుమార్‌, సురేశ్‌బాబు, రీసెర్చ్‌ స్కాలర్స్‌ తదితరులు పాల్గొన్నారు.

భార్య, పాపను చూసేందుకు వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



యాకాంబ్రం (ఫైల్‌)



పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌

నెక్కొండ/ కేసముద్రం : తనకు మరో మహాలక్ష్మి జన్మించిందనే సంతోషంతో ఓ వ్యక్తి.. బైక్‌పై భార్య, పాపను చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో అతనిని కబలించింది. ఈ ఘటన సోమవారం నెక్కొండ మండల కేంద్రంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం (స్టేషన్‌)లోని కిష్టాపురానికి చెందిన మందాటి యాకాంబ్రం (37) కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ కార్యాలయంలో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 9 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన లావణ్యను కులాంతర వివాహం చేసుకోగా ఆ దంపతులకు కూతురు ఆరేళ్ల అరణ్య ఉంది. ఈ క్రమంలో ఈ నెల 11న వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో రెండో సంతానంగా పాప జన్మనించింది. ఈ విషయం తెలుసుకున్న యాకాంబ్రం అదే రోజు రాత్రి తన భార్య, పాపను చూసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అప్పల్‌రావుపేట– నెక్కొండ రహదారి వద్ద చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తుమని ఎస్సై జానీపాషా తెలిపారు. కాగా, యాకాంబ్రం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. 2011 ఫిబ్రవరి 22, 23 తేదీలలో 48 గంటల రైల్‌ రోకో చేపట్టారు. ఈ సమయంలో మణుగూరు ప్యాసింజర్‌కు నిప్పు పెట్టిన ఘటనలో యాకాంబ్రం ప్రధాన నిందితుడు. కాగా, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌.. యాకాంబ్రం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాకాంబ్రం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆర్‌ఈ మాస్ట్‌ల తరలింపు..



కాజీపేట నుంచి వాహనాల్లో తరలుతున్న ఆర్‌ఈ మాస్ట్‌లు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌కు 3వ లైన్‌ నిర్మాణంలో భాగంగా విద్యుత్‌ ఏర్పాటు కోసం ఆర్‌ఈ మాస్ట్‌లు కాజీపేట జంక్షన్‌ నుంచి (3వ లైన్‌ నిర్మాణం పూర్తయిన తర్వాత ట్రాక్‌కు పక్కన ఏర్పాటు చేసే విద్యుత్‌ స్తంభం) తరలిస్తున్నారు. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మార్గాలలో 3వ లైన్‌ నిర్మాణంలో భాగంగా ఓహెచ్‌ఈ విద్యుత్‌ విభాగానికి సంబంధించిన ఆర్‌ఈ మాస్ట్‌లను భారీ వాహనాలలో ఆయా రూట్‌లకు తరలిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాగా, ఈ ఆర్‌ఈ మాస్ట్‌లు ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్‌ విభాగం అధికారులు ఓహెచ్‌ఈ విద్యుత్‌ కనెక్షన్‌ ఇచ్చిన అనంతరం రైళ్ల ట్రాఫిక్‌ కొనసాగుతుందని తెలిపారు. కాగా, భారీ వాహనాలలో తరలిస్తున్న ఈ ఆర్‌ఈ మాస్ట్‌లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

REAL ESTATE

కుడా లే అవుట్‌ ప్లాట్లు అమ్మబడును
■ కుడా లే అవుట్‌ ప్లాట్లు అమ్మబడును. GWMC పరిధి చింతగట్టు హన్మకొండ, న్యూ వెంచర్‌ ఓపెనింగ్‌ 14/06/2023.DPNo. TCPNo: 0414/LO/3006/2023 ఆఫీస్‌ సుబేదారి, టి.స్వామి. 968331226. [W-785605]

KUDA ప్లాటు అమ్మబడును
■ హన్మకొండ RTO Office చింతగట్టులో న్యూ కుడా లే అవుట్‌ వెంచర్‌ అన్ని వసతులతో తక్షణమే ఇల్లు నిర్మించుకునే బ్యాంక్‌ లోన్‌ సౌకర్యం ప్లాట్లు 14-06-23 రోజున ప్రారంభం అవుతుంది. సం॥సిరి, 6301613156. [WA-6984]

HOUSE & ఇల్లు అమ్మకం
■ వరంగల్‌ చౌరస్తాకి 7 కి॥మీ॥ ఖమ్మం హైవేకి 500 మీటర్ల వాగ్దేవికి 21/2 కి॥మీ ముందు మామునూర్‌ ఎత్తైన ప్రదేశం 390 చదరపు గజాలు G+1 పైన 4 క్రింద 3 రూంలు 1560 Sft తూర్పు ఫేసింగ్‌ 40 ఫీట్ల రోడ్‌ దక్షిణం 40 ఫీట్ల S/E కార్నర్‌ ప్లాటు చుట్టు కుడా లే అవుటు దగ్గర్లో నిర్మిత నిర్మాణమౌతున్న ఇళ్లు. 9032111600. [W-785603]

PLOT FOR SALE
■ ఒగ్లాపూర్‌ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్‌ రోడ్‌కు ఆనుకొని కాంపౌండ్‌ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9849544437. [W-785590]

SERVICES

LOANS
■ హౌసింగ్‌, బిజినెస్‌, పర్సనల్‌, మార్టిగేజ్‌ & ఉద్యోగస్తులందరికి పర్సనల్‌ ఋణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్‌-WGL. 9618767116 [W-785592]
■ సిరి అసోసియేట్స్‌: హౌజ్‌, ఫ్లాట్‌, ఓపెన్‌ ప్లాట్‌, ల్యాండ్‌, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్‌ చేసుకొని వారంలో అమౌంట్‌ ఇప్పించబడును. సెల్‌: 9666142226. [W-785581]
■ సులభంగా లోన్‌ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్‌, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్‌, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

WANTED
■ వరంగల్‌లోని చికెన్‌ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్‌ కావలెను. జీతం 21,000+ రూం+ భోజనం ఫ్రీ. సెల్‌: 6281342090, 9949857816. [WA-6983]

తాజా వార్తల కోసం లాగాన్‌ అవ్వండి www.sakshi.com

మేక పిల్లలు పెంచండి
మేలు జాతి మేక పిల్లలను ఎలాంటి కష్టనష్టాలు లేకుండా 6 నెల్ల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందండి.
10 Kg నుండి పిల్లలు కలవు. సంప్ర:
S.V. Agro Farm
Hunter Road, Warangal
Cell : 9959426718

■ ప్రముఖ రియల్‌ ఎస్టేట్‌ కంపెనీలో మార్కెటింగ్‌ చేయడానికి ఎగ్జిక్యూటివ్స్‌ కావలెను. ఫిక్స్‌డ్‌ సాలరీ 20 వేలు ఆపైన అర్హతలు నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్‌ ఉద్యోగులు, గృహిణిలు. 7396731977, 9390263045. [W-785604]
■ ప్రముఖ గ్లోబల్‌ కంపెనీలో వర్క్‌ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించే అవకాశం. 100% ఎటువంటి ఫీజులు ఉండవు. Work From Home. ఫోన్‌ : 85001 48297 [V- 794635]
■ లేపాక్షి హెల్త్‌ కేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18k. ఏజెంట్‌ కమీషన్‌ 6k. ఫోన్‌: 9640400073 [HA-284]

WANTED TEACHERS
■ Wanted teachers to teach Telugu, Hindi, Computers for 1 to 7th and Preprimary teachers. Whatsapp your resume to 9154665006, Masster HS, Fort WGL. [W-785593]
■ Lady Teachers: Mother Teachers for Pre-Primary, Hindi, Eng., & Supporting Teacher (1st-5th), Maths Teachers (3rd -7th) Fluent in Eng. are preferable. Indian Kids School, S.V.N Road,WGL. 9963006221 [W-785589]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్‌ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్‌ 9010144453
జయశంకర్‌ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.